## దవాఖానలో అలంకార ప్రాయంగా లిఫ్టు

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 16: పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ దవాఖానలో గత కొన్ని రోజులుగా లిఫ్టు పని చేయకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో అంతస్తుకు నడుచుకుంటూ వెళ్లాలంటే గర్భిణులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా లిఫ్టు బాగు చేయించి ఇబ్బందులు తీర్చాలని వారు కోరుతున్నారు.


పని చేయని లిఫ్టు

## బిల్లులు చెల్లించలేదని.. పాఠశాలలో పనుల అడ్డగింత

గంగాధర, ఏప్రిల్ 16: గంగాధర మండలం ఉప్పర మల్యాల ప్రభుత్వ పాఠశాలలో అమ్మఆదర్శ పాఠశాలలో భాగంగా తరగతి గదులకు రంగులు వేస్తున్న సిబ్బందిని తాజా మాజీ సర్పంచ్ బోల్గొండి మంజుల భర్త శ్రీనివాస్‌రెడ్డి బుధవారం అడ్డుకున్నారు. మనఊరు మనబడిలో భాగంగా ఉప్పరమల్యాల ప్రభుత్వ పాఠశాలలో చేసిన అభివృద్ధి పనులకు గానూ తనకు రూ.5 లక్షల 50 వేల బిల్లు రావలసి ఉందని, తన బిల్లు చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని తెలిపారు. తనకు రావలసిన బిల్లును చెల్లించిన తర్వాతే పనులు చేయాలని కోరారు. ఎంఈవో ప్రభాకర్ రావును వివరణ కోరగా, శ్రీనివాసరెడ్డి తో మాట్లాడినట్లు తెలిపారు. పైఅధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు.

## హామీలు అమలు చేయాలి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 16: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం చామనపల్లి గ్రామంలో ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సీపీఐ కరీంనగర్ మండల 8వ మహాసభకు ఆయన హాజరయ్యారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ, తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులు ఇద్దరు ఉన్నా రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు చొక్కారావు పేద బడుగు బలహీన వర్గాల కోసం అనేక ఉద్యమాలు చేశారని, కరీంనగర్ మండలానికి ఆయన పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. మండల కార్యదర్శి సాయిలేని రాయమల్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT: KARIMNAGAR**
ARB No. M/KA 848 of 2024
Between:-
M/s.Margadarsi Chit Fund Private Limited., Ramagundam ...Disputant
AND
CHIRALA SRINIVAS & Others ...Opponents
**NOTICE**
To,
O-3 SUTHRAVE RAVI,
S/o.Ramaswami,
R/o.H.No.8-3-156,
Bhagath nagar, Karimnagar.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money. In the past you have been issued summon, but you have failed to receive the same. The above dispute is posted on **30-05-2025** for your appearance. On that day you have to appear in person at 10:30 A.M. before the Deputy Registrar referred above. Otherwise the case will be decided ex-parte.
Sd/- **DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, KARIMNAGAR.**

## కోతలు లేకుండా కొనుగోళ్లు జరుపాలి

• కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 16: కటింగులు, కోతలు లేకుండా వరి ధాన్యం కొనుగోళ్లు జరుపాలని కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ మార్కెట్ అధికారులను ఆదేశించారు. హుజూరాబాద్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌తో పాటు తుమ్మనపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం కలెక్టర్ సందర్శించారు. తూకం, తేమ యంత్రాల పనితీరును ఆమె పరిశీలించారు. సౌకర్యాల కల్పనకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాలకు వచ్చే మహిళలు, ఉపాధి హామీ కూలీలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు.


ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

## కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

• రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, ఏప్రిల్ 16: ప్రభుత్వం రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మండలంలోని సోమారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో, బొత్తలపల్లిలో వెన్నంపల్లి –సైదాపూర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో రమేశ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంత సుధాకర్, సింగిల్‌విండో చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి, తహసీల్దార్ మంజుల , నాయకులు గుండారపు శ్రీనివాస్, బొమ్మగాని రాజుగౌడ్, లంకదాసరి మల్లయ్య, చాంద్‌పాషా, కొండ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.


బొత్తలపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం

## రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు


రామడుగు మండలం వెలిచాలలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావు

రామడుగు, ఏప్రిల్ 16: ప్రతి గ్రామంలో రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. రామడుగు మండలం వెలిచాల, కొక్కెరకుంట, దేశరాజ్‌పల్లి గ్రామాల్లో రామడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం ఆధ్వర్యంలో, వెదిరలో ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. దీనిలో భాగంగా వెలిచాలలో సింగిల్‌విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వరరావుతో కలిసి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని, ధాన్యం పూర్తిగా ఆరిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, అధికారులు ఉన్నారు.

**చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం**

గంగాధర, ఏప్రిల్ 16: రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని గంగాధర, కురిక్యాల సింగిల్ విండోల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలాగౌడ్, వెలిచాల తిర్మల్‌రావు, వైస్ చైర్మన్ వేముల భాస్కర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జాగిరపు రజితా శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT: KARIMNAGAR**
ARB No. M/KA 853 of 2024
Between:-
M/s.Margadarsi Chit Fund Private Limited., Ramagundam ...Disputant
AND
ALLADI RAGHAVENDRA RAO & Others ...Opponents
**NOTICE**
To,
O-1 ALLADI RAGHAVENDRA RAO,
S/o.Hanumanth Rao,
R/o.H.No.8-17/1, Mahathma Nagar,
Mdl:Thimmapur, Karimnagar Dist.
O-3 KONDI SHESHI KUMAR,
S/o.Pedda Kumara Swamy,
R/o. H.No.8-6-360/1/A,
Alakapuri Colony, Road No.6
Karimnagar.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money. In the past you have been issued summon, but you have failed to receive the same. The above dispute is posted on **30-05-2025** for your appearance. On that day you have to appear in person at 10:30 A.M. before the Deputy Registrar referred above. Other-wise the case will be decided ex-parte.
Sd/- **DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, KARIMNAGAR.**

## పట్టణంలో కలెక్టర్ విస్తృత పర్యటన

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 16:హుజూరాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోషణ జాతర కార్యక్రమాన్ని కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. అనంతరం ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హుజూరాబాద్ కేసీ క్యాంపు వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. నాణ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని ఆదేశించారు. హుజూరాబాద్ కేసీ క్యాంప్‌లోని మిషన్ భగీరథ గ్రిడ్, కార్యనిర్వాహక ఇంజినీర్ కార్యాలయాన్ని సందర్శించారు. వేసవికాలం దృష్ట్యా మిషన్ భగీరథ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి సరఫరాలో సమస్యలను వెంటవెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. హుజూరాబాద్ పురపాలక సంఘం కార్యాలయాన్ని సందర్శించి, ఇక్కడ మెప్మా సిబ్బంది ఆధ్వర్యంలో పొడి చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో రమేశ్ బాబు, జిల్లా సంక్షేమ అధికారి సబిత, మెప్మా పీడీ వేణు మాధవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత, సీడీపీవో సుగుణ, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రత్యేక సాయం అందించండి

• కేంద్ర మంత్రులకు బండి సంజయ్ వినతి

విద్యానగర్, ఏప్రిల్ 16: వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ప్రాంతాలను ఆధ్యాత్మిక విశ్రాంతి కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక సాయం అందించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కోరారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయ పథకం కింద నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే సిరిసిల్ల లేదా సిద్దిపేట జిల్లాలో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను కోరారు. బుధవారం ఆయన న్యూఢిల్లీలో కేంద్ర మంత్రులను వేర్వేరుగా కలిసి ఈ మేరకు వినతి పత్రాలు అందజేశారు. కాగా, బండి సంజయ్ విజ్ఞప్తిపై వారు సానుకూలంగా స్పందించారు. సిరిసిల్ల లేదా హుస్నాబాద్ పట్టణంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు అవకాశాలపై తగిన చర్యలు తీసుకోవాలని రాజ్ నాథ్ సింగ్ అధికారులను ఆదేశించారు.

## నేటి నుంచి భూభారతిపై అవగాహన సదస్సులు

కలెక్టరేట్, ఏప్రిల్ 16 : నూతన రెవెన్యూ చట్టం భూభారతిపై అవగాహన కల్పించేందుకు జిల్లాలో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. గురువారం నుంచి ఈనెల 30 వరకు జిల్లాలోని 15 మండలాల్లో సదస్సులు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేశారు. సదస్సులు సక్సెస్ చేసేందుకు రెవెన్యూ డివిజనల్ అధికారులను నోడల్ అధికారులుగా నియమించగా, ఆయా మండలాల్లో సదస్సుల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు తహసీల్దార్లకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తూ, కలెక్టర్ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మొదటి రోజు తిమ్మాపూర్, గన్నేరువరం మండలాల్లో ఈనెల 19న హుజూరాబాద్‌లో, 22న రామడుగు, గంగాధర మండల కేంద్రాల్లో, 23న చొప్పదండిలో, 24న శంకరపట్నం, మానకొండూర్ మండలాల్లో, 25న జమ్మికుంట, ఇల్లందకుంట మండలాల్లో, 26న కరీంనగర్ రూరల్, కొత్తపల్లి మండలాల్లో, 29న చిగురుమామిడి, వెన్కెపల్లి సైదాపూర్ మండలాల్లో, 30న వీణవంక మండల కేంద్రంలో నిర్వహించేందుకు షెడ్యూలు రూపొందించినట్లు, బుధవారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు.

## సత్తాచాటిన ఢిల్లీ ఢిఫెన్స్ అకాడమీ విద్యార్థులు

• ఆర్మీలో 113, నేవీలో 16 మందికి ఉద్యోగాలు


ఉద్యోగాలు సాధించిన ఢిల్లీ డిఫెన్స్, జూనియర్ కళాశాల విద్యార్థులు

కొత్తపల్లి, ఏప్రిల్ 16 : ఇండియన్ ఆర్మీ, నేవీ ఫలితాల్లో రేకుర్తిలోని ఢిల్లీ ఢిఫెన్స్ అకాడమీ, జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి సత్తాచాటి రాష్ట్రంలోనే అత్యధిక ఉద్యోగాలు సాధించారని అకాడమీ చైర్మన్ కొత్త సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం అకాడమీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. మార్చి 27న వెలువడిన ఇండియన్ ఆర్మీ ఫలితాల్లో జీడీ, క్లర్క్, టెక్నికల్ విభాగంలో అకాడమీకి చెందిన 113 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని, అలాగే ఇండియన్ నేవీలోని ఎస్ఎస్ఆర్ విభాగంలో 16 మంది ఉద్యోగాలు సాధించి మరోసారి ప్రతిభ చూపారన్నారు. మారుతున్న అభ్యర్థుల ఎంపిక విధానానికి అనుగుణంగా విద్యార్థులను శారీరకంగా, మానసికంగా సిద్ధం చేయడంతోనే ఇలాంటి ఫలితాలు అకాడమీకి సాధ్యమవుతున్నాయన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అమ్మాయిలకు సఫరేట్ క్యాంపస్‌లో డిఫెన్స్ ఉద్యోగాలకు కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 16: కరీంనగర్‌లో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఏబీ స్విచ్ పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1, కరీంనగర్ రూరల్ ఏడీఈలు పంజాల శ్రీనివాస్ గౌడ్, రఘు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఉదయం 7నుంచి 10గంటల వరకు డీ మార్ట్ ఏరియా, వరలక్ష్మి గార్డెన్, తులసీ నగర్, హెచ్‌పీ గ్యాస్ గోదాం, రెడ్డి ఫంక్షన్ హాల్ వెనుక ప్రాంతం, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కమాన్ పూర్ గ్రామం, గ్రానైట్ ఇండస్ట్రీస్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## కార్యాలయంలో లీకేజీ.. విధులకు ఇబ్బంది

కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెండో అంతస్తులో బుధవారం పైపులైన్ లీకేజీతో నీరు చేరింది. దీంతో అధికారులు, సిబ్బంది తమ విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో అటెండర్లు, ఇతర సిబ్బంది ఆ నీటిని తొలగించేందుకు శ్రమించారు. అయితే ఇంజినీరింగ్ విభాగం ఉన్న అంతస్తులోనే ఈ లీకేజీ చోటు చేసుకోవడం.. ఫ్లోర్‌పై నిలిచిన నీరు సులువుగా వెళ్లే అవకాశం లేకపోవడం ఆ అధికారుల పనితీరుకు నిదర్శనమన్న విమర్శలు వినిపించాయి.

*- కార్పొరేషన్, ఏప్రిల్ 16*


బల్దియా కార్యాలయంలో అధికారి చాంబర్‌లోకి వచ్చిన నీటిని తొలగిస్తున్న సిబ్బంది

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**
I, GEDELA SHANKAR RAO S/o. GEDELA NARAYANA RAO, R/o. H.No.21-6-93/6, Ex-Servicemen Colony, Gouthami Nagar, Mdl: Ramagundam, Dist: Peddapalli, TG, Have Changed My Name From GEDULASHANKARA RAO TO GEDELA SHANKAR RAO S/o.GEDELA NARAYANA RAO for all Purpose.

**CHANGE OF NAME**
I, MOHAMMAD RAFEE S/o. MOHAMMAD IMAM ALI, R/o. H.No.19-7-310, Ashok nagar, Godavarikhani, Ramagundam Mandal, Peddapalli District, TG, Have changed my Name From MAHAMMAD RAFI, S/o. MAHAMMAD IMAM ALI to MOHAMMAD RAFEE, S/o. MOHAMMAD IMAM ALI for all purpose.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## రజతోత్సవాన్ని సంబురంగా జరుపుకొందాం


గట్టుభూత్కూర్‌లో బీఆర్ఎస్ పార్టీ జెండా గద్దెకు రంగులు వేస్తున్న కార్యకర్తలు

గంగాధర, ఏప్రిల్ 16: ఈనెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా గ్రామంలో సంబురాలను నిర్వహించుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామ తాజా మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గట్టుభూత్కూర్‌లో బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో పార్టీ జెండా గద్దెకు రంగులు వేసి సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ విజేందర్ రెడ్డి మాట్లాడుతూ, రజతోత్సవ సభకు తరలివెళ్లడానికి ముందు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామాధ్యక్షుడు బొడ్డు మల్లేశం, నాయకులు బుర్ర లక్ష్మీనారాయణ గౌడ్, బొల్లబతిని రాకేశ్, అముడగోని సతీశ్‌గౌడ్, చొక్కల శ్రీనివాస్, బొయిని మునీందర్, బొడ్డు శ్రీనివాస్, రామంచ రమేశ్, బుర్ర అజయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీల్లో 'అద్విత' విద్యార్థి ప్రతిభ

కొత్తపల్లి, ఏప్రిల్ 16 : అద్విత ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన 2వ తరగతి విద్యార్థి ఎన్ హిమానిష్, గోవాలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కేడెట్ కాటా విభాగంలో గోల్డ్ మెడల్, బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నాడు. ఈ సందర్భంగా బుధవారం అద్విత పాఠశాల ఎండీ అనుదీప్ సొగాని విద్యార్థిని అభినందించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ మధురి స్వేత ఉన్నారు.


హిమానిష్

## 'మానేరు'లో క్రీడా పోటీల బహుమతుల ప్రదానోత్సవం

కొత్తపల్లి, ఏప్రిల్ 16 : కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల్లో 2024– 25 విద్యా సంవత్సరానికి గానూ నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బుధవారం ఉదయం మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, ప్రిన్సిపాల్ రాజు చాకో, సరితా రెడ్డి, పీఈటీలు చిలివేరి మహేందర్, తిరుపతి జహీదా, స్వామి తోపాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 16 : అల్ఫోర్స్ ఇ–టెక్నో విద్యార్థులు శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఒలింపియాడ్లలో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని విద్యాసంస్థల అధినేత డాక్టర్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలకు చెందిన పి. శ్లోక, ఎండీ అబ్దుల్ అర్హాన్, జి. సాయి సంహిత్, ఎం. శివేన్ రెడ్డి, డి. స్నిగ్ధాశ్రీ, ఎ. వాన్మయి, కే సాన్వి ప్రతిభ చూపి బంగారు పతకాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లక్కీడ్రా ద్వారా షాపుల కేటాయింపు

కార్పొరేషన్, ఏప్రిల్ 16: కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని శాతవాహన యూనివర్సిటీ వద్ద నిర్మించిన 25 షాపులకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన అధికారులు బుధవారం లక్కీడ్రా నిర్వహించి షాపులు కేటాయించారు. బుధవారం స్థానిక కళాభారతిలో దరఖాస్తుదారుల సమక్షంలో నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ లక్కీ డ్రా ద్వారా షాపుల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, ఆర్వో భూమానందం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓపెన్ పరీక్షా కేంద్రాల తనిఖీ

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 16: ఈనెల 20నుంచి 26 వరకు జరుగబోయే ఓపెన్ ఇంటర్, పదవ తరగతి పరీక్షల కోసం పట్టణంలో ఏర్పాటు చేసిన రెండు కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ జనార్దన్ రావు సందర్శించి తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

## మేట్లకు ఎఫ్ఏలుగా అవకాశం కల్పించాలి

శంకరపట్నం, ఏప్రిల్ 16: ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు లేని చోట సీనియర్ మేట్లకు ఎఫ్ఏలుగా అవకాశం కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం ఆయన కన్నాపూర్ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించారు. ఎఫ్ఏలు లేని చోట సీనియర్ మేట్లకు అవకాశం కల్పించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. లేకపోతే సీనియర్ మేట్లతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 16: అప్రమత్తంగా ఉండడం ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా అగ్ని మాపకాధికారి ఎస్ రాజుకుమార్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం కరీంనగర్ తీగలగుట్టపల్లిలో అగ్నిమాపక సిబ్బంది పలు విన్యాసాలు ప్రదర్శించారు. వాల్ పోస్టర్స్ అంటించి, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అగ్ని మాపకాధికారి, అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్రిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

## కొడుకు, కోడలు నుంచి రక్షణ కల్పించాలని తహసీల్దార్‌కు వినతి

శంకరపట్నం, ఏప్రిల్ 16: కొడుకు, కోడలు తిండి పెట్టకుండా తనను హింసిస్తున్నారని రాజాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆసరి ఐలయ్య బుధవారం తహసీల్దార్ భాస్కర్‌ను కలిసి గోడు వెల్లబోసుకున్నారు. తనను తిండి పెట్టకుండా ఇంట్లోంచి బయటకు గెంటివేశారని కన్నీళ్ల పర్యంతమయ్యారు. వారి నుంచి తన ఇల్లు, భూమిని తనకు తిరిగి ఇప్పించి తనకు రక్షణ కల్పించాలని ఐలయ్య తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే ఆర్ఐ బాలకిషన్‌కు వివరాల సేకరణకు ఆదేశాలు జారీ చేశారు. తాను, ఎస్ఐ కొత్తపల్లి రవితో కలిసి వెంటనే తగిన చర్యలు చేపడతామని మాజీ ఎంపీటీసీకి భరోసా కల్పించారు.

## వేసవి కాలం ఆరుబయట పడుకుంటున్నారా..?

జాగ్రత్తలు తీసుకోండి • టౌన్ ఏసీపీ వెంకటస్వామి

కరీంనగర్, ఏప్రిల్ 16 (నమస్తే తెలంగాణ): వేసవి కాలంలో ఆరుబయట పడుకుంటున్న వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని టౌన్ ఏసీపీ వెంకటస్వామి తెలిపారు. వేసవి కాలం దృష్ట్యా ఉక్కపోతతో ప్రజలు ఇంటి బయట నిద్రిస్తుండడం వల్ల దొంగతనాలు జరిగే ఆస్కారం ఉందని, వాటిని నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నగలు, డబ్బు ఇతర విలువైన వస్తువులను ఇంట్లో సురక్షితమైన స్థలంలో భద్రపరుచుకోవాలన్నారు. రాత్రిపూట ఇంటి పరిసరాల్లో కొన్ని లైట్లు వెలుగుతూ ఉండేలా చూసుకోవాలని సూచించారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇంటి పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను గమనిస్తే సమీపంలోని పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఒకవేళ దొంగతనం జరిగితే, వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగలను గుర్తించడం, పట్టుకోవడం సులభమవుతుందని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

## టెక్ట్స్‌బుక్స్‌లేకుండా నూతన విధానంలో విద్యాబోధన

కొత్తపల్లి, ఏప్రిల్ 16 : సంప్రదాయ పద్ధతులకు స్వస్తి పలుకుతూ, టెక్ట్స్‌బుక్స్ లేకుండా ప్రయోగాత్మక అధ్యయన విధానాన్ని బన్సల్ క్లాసెస్‌లో ప్రవేశపెడుతున్నామని బన్సల్ క్లాసెస్ జూనియర్ కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం రేకుర్తిలోని కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంచేలా కరిక్యూలమ్‌ను రూపొందించామని, రోజుకు 45 ప్రశ్నల ద్వారా సబ్జెక్ట్ వారీగా మౌలిక అవగాహన పెంపొందేలా ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనున్నట్లు తెలిపారు. పోటీ వాతావరణంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని తగ్గించాలనే లక్ష్యంతో, సరళమైన తీరులో బోధనకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. మంచిర్యాల జిల్లాలోని ఉట్నూర్ గ్రామంలో ఇప్పటివరకు 200 మందికి పైగా ఐఐటీయన్‌లను, 20 మందికి పైగా డాక్టర్లను బన్సల్ క్లాసెస్ తయారు చేసినట్లు తెలిపారు. కరీంనగర్‌లో బన్సల్ క్లాసెస్ రెండోదని, మే 28 నుంచి ఇక్కడ తరగతులు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి తరానికి సీనియర్ సిటిజన్లు ఆదర్శం

కలెక్టరేట్, ఏప్రిల్ 16 : ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించడంలో నేటి తరానికి సీనియర్ సిటిజన్లు ఆదర్శంగా మారుతున్నారని ఓల్డ్ హైస్కూల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శంకరానందం అన్నారు. బుధవారం క్లబ్ ఆధ్వర్యంలో పలువురు సీనియర్ సిటిజన్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాథూరాం, రఘురాం, వివేక్, హర్ష, మల్లిక్, వెంకటస్వామి, రఘోత్తంరెడ్డి, రాములు, ఈర్యానాయక్, తహసీన్, నస్రీన్ జహాన్, సలావుద్దీన్, ఖైరుద్దీన్, గగులోతు స్వామి, మల్లిక, రమతో పాటు పలువురు పాల్గొన్నారు.

## లైన్ మెన్ సస్పెన్షన్

ముకరంపుర, ఏప్రిల్ 16: కరీంనగర్ సర్కిల్ పరిధిలోని గోపాలరావుపేట్ సెక్షన్ లైన్ మెన్ జే లక్ష్మీనారాయణను సస్పెండ్ చేస్తూ కరీంనగర్ రూరల్ డీఈ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గోపాల్ రావుపేటలో ఓ ఇంటికి ఎలాంటి మంజూరు లేకుండా అనధికారికంగా విద్యుత్ మీటర్ బిగించిన విషయమై స్థానిక ఏడీఈ విచారించి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా డీఈ లైన్ మెన్‌ను సస్పెండ్ చేశారు.

## చలివేంద్రం ప్రారంభం

కలెక్టరేట్, ఏప్రిల్ 16 : నగరంలోని ముస్లిం సామాజిక సేవా సంస్థ దారుల్ ఖైర్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంగడి బజార్‌లో చలివేంద్రం ప్రారంభించారు. వేసవిలో ఎండలు మండిపోతున్న నేపథ్యంలో వివిధ అవసరాల నిమిత్తం వచ్చిపోయే ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా, చలివేంద్రాన్ని ఏర్పాటుచేసినట్లు, మతిన్ అండ్ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మతిన్, అహ్మద్ అల్‌జైదీ, నజీబ్ అహ్మద్, ఫసీ, ఉస్మాన్, అజమ్‌ఖాన్, అజీజ్, జమాలొద్దీన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

గంగాధర, ఏప్రిల్ 16: గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలోని కాపువాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధిహామీ నిధులు రూ.3.50 లక్షలతో చేపట్టే ప్రహరీ నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్మాణానికి స్థలాన్ని అందించిన దాతలను ఎమ్మెల్యే అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి వినయ్‌కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 19న వారధి కథా సంకలనం ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 16 : జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటలకు భగత్‌నగర్ భగవతి హైస్కూల్‌లో రచయిత కటుకోజ్వల మనోహరాచారి రచించిన వారధి కథా సంకలనం ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని అధ్యక్ష కార్యదర్శులు గాజుల రవీందర్, నంది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరవుతారని, స్తంభంకాడి గంగాధర్ పుస్తక పరిచయం చేస్తారని పేర్కొన్నారు.

## హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలి

వీణవంక, ఏప్రిల్ 16: హమాలీ కార్మికుల కూలి రేట్లు పెంచాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పిల్లి రవియాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని బీరన్న గుడి ఆవరణలో బుధవారం నిర్వహించిన హమాలీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం హమాలీ కార్మికులందరికీ గుర్తింపు కార్డులివ్వడంతోపాటు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు రవి, కొమురయ్య, శంకర్, రవీందర్, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ట్రాక్‌సూట్ పంపిణీ

రామడుగు, ఏప్రిల్ 16: వెలిచాల అనుబంధ గ్రామం గుడ్డేలుగులపల్లి ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు కలెక్టర్ సహకారంతో బుధవారం ట్రాక్‌సూట్స్‌ను మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం తిరుపతిరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

## సమావేశం విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 16: నగరంలోని ఆర్టీసీ వర్క్‌షాపు సమీపంలో గల జీఏకే గార్డెన్‌లో ఈనెల 19న నిర్వహిస్తున్న తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు సముద్రాల అజయ్, క్యాదాసి ప్రభాకర్, సుద్దాల లక్ష్మణ్ కోరారు. నగరంలోని ఆ సంఘ కార్యాయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఇక్కడ నాయకులు కల్వాల ఆనందర్, గొస్కు శంకర్, రాజయ్య ఉన్నారు.